

క్రీడల్లో వశిష్ట స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంగళ్ళులోని విశ్వం పాఠశాలలో రిపబ్లిక్ డేను పురస్కరించుకొని 24, 25వ తేదీలలో ఇంటర్ స్కూల్ చాంపియన్‌షిప్ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మదనపల్లెకు చెందిన వశిష్ట స్కూల్ సిబిఎస్ఇ బాలబాలికల జట్లు పాల్గొని బాస్కెట్ బాల్‌లో పలు విభాగాలలో బాలురు, బాలికలు విజేతలుగా నిలిచారు. ఖోఖో, వాలీబాల్‌లో బాలురు రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. విజేతలుగా నిలిచారు. సోమవారం వశిష్ట పాఠశాల ఆవరణలో క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థినీ విద్యార్థులను చైర్మెన్ డాక్టర్ పి.వి.ఆర్.గుప్తా, మేనేజింగ్ ట్రస్టీ పి.యశ్వంత్, ప్రిన్సిపల్ ఎన్.సంధ్య రాణి, వ్యాయామ ఉపాధ్యాయులు గురుప్రసాద్, గాయత్రి, ఉపాధ్యాయబృందం అభినందించారు. మరిన్ని క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు.



క్రీడా సర్టిఫికెట్లతో విద్యార్థులు

విద్యా సంస్థలకు తొత్తుగా ప్రభుత్వం

- నిరసనలో విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థలకు తొత్తుగా కూటమి ప్రభుత్వం మారిందని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహులు సర్వేపల్లి అన్నారు. సోమవారం స్థానిక రాయచోటి పట్టణంలోని మాసాపేట అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నారాయణ, శ్రీ చైతన్య కళాశాలలు విద్యార్థులపై ఫీజులు చెల్లించాలని తీవ్రమైన వేధింపులు గురిచేస్తూ, ర్యాంకుల కోసం విద్యార్థుల మధ్య తారతమ్యాలు సృష్టిస్తూ విద్యార్థుల మరణాలకు కారణమవుతున్నాయని చెప్పారు. కార్పొరేట్ విద్యా సంస్థల యజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కార్పొరేట్ నారాయణ, చైతన్య, కళాశాలలో ఫీజులు చెల్లించాలని వేధింపులు గురిచేయడం వల్ల విజయవాడలో చైతన్య గోశాల క్యాంపస్, గోసలైట్, అనంతపురం నారాయణ కళాశాలలో ఫీజు చెల్లించలేదని గంటల తరబడి విద్యార్థిని తరగతి గది ముందు నిలబెట్టడంతో విద్యార్థి మనస్తాపానికి గురై అక్కడికక్కడే మూడో అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా విద్యాసంస్థల తొత్తుగా మారి ఫీజులు దోపిడీకి కారణమవుతుందని అన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. గతంలో ఎన్నికల ముందు పవన్ కల్యాణ్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు చనిపోతున్నారని చెప్పిన ఆయన నేడు విద్యార్థులు చనిపోతున్న ఎందుకు మాట్లాడటం లేదు అని ప్రశ్నించారు. ఆత్మహత్యలపై గతంలో టిడిపి ప్రభుత్వం ప్రొఫెసర్ నీరద రెడ్డి కమిషన్ వేసిందని, కానీ సిఫారసులను అమలు చేయడంలో విఫలం చెందిందని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యా మండలి కమిషనర్ స్పందించి నారాయణ చైతన్య విద్యాసంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఘటనలకు కారణమైన విద్యాసంస్థలను సీజ్ చేయాలని, యజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు ఒత్తిడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి అశోక్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గురునాథ్, పవన్ నాయక్, సంఘాల నాయకులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** నారాయణ విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర పిలుపులో భాగంగా పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా నాయకులు రామ్ చరణ్, ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** విద్యార్థి మృతికి కారణమైన నారాయణ విద్యా సంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, డబ్బులు మీద ఉన్న శ్రద్ధ విద్యార్థి ప్రాణాల మీద లేదా అని ఎస్ఎఫ్ఐ సూటిగా ప్రశ్నించింది. సోమవారం రాష్ట్ర పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రయివేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీని నియమించి విచారణ చేపట్టాలని. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అప్రిద్, నాయకులు సమీర్, జయ బాబు, విష్ణు, జస్వంత్, గణేష్, నరేష్ పాల్గొన్నారు.



రాయచోటి : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు



రాజంపేట : నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరిం చాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తారన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని తెలిపారు. అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని తెలిపారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని సూచించారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్య తగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదనరావు, రాయచోటి ఆర్‌డిఓ శ్రీనివాస్, ఎస్‌డిసి రమాదేవి పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఎలక్ట్రీషియన్ల సమస్యల పరిష్కారానికి చర్యలు : మంత్రి



ఎలక్ట్రీషియన్ సంఘం నాయకులతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో పనిచేస్తున్న ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. నేషనల్ ఎలక్ట్రీషియన్స్ డే సందర్భంగా సోమవారం పట్టణంలోని పిడిఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలామంది ఎలక్ట్రికల్ పనిచేస్తూ జీవిస్తున్నారని వారందరికీ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వర్కర్ల కోరిక మేరకు అర్హులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేస్తామన్నారు. రాబోయే రోజులలో ఎలక్ట్రీషియన్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** శ్రీ అన్నమయ్య ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎలక్ట్రీషియన్ డే ఆరవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జండా వందనంతో కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎలక్ట్రీషియన్ యూనియన్ జిల్లా కార్యదర్శి తరుణ్ కుమార్ హాజరై మాట్లాడారు. రాజంపేట మండల పరిధిలోని ప్రతి ఒక్క ఎలక్ట్రీషియన్ యూనియన్‌తో కలిసి మెలిసి ఐకమత్యంతో వ్యవహరిస్తే ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చునని తెలిపారు. ఎలక్ట్రీషియన్లకు యూనియన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీ అన్నమయ్య ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ యూనియన్ మండల అధ్యక్షులు వర్మ, ఉపాధ్యక్షులు మహంకాళి, కార్యదర్శి సంజీవ నాయుడు, సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కోశాధికారి సురేష్, కార్యనిర్వాహక కార్యదర్శి నాగేశ్వర్ రెడ్డి, ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.

విఒఎల బకాయి వేతనాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విఒఎ (యానిమేటర్ల)లకు 64 కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేసి8 నెలలు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. ఎపి వెలుగు ఉద్యోగుల సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్నమయ్య కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం యానిమేటర్లు సామూహిక దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యానిమేటర్లపై పీలేరు, రాయచోటి, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లోని కలకడ, కెవిపల్లి, చిన్నమండెం, గాలివీడు మండలాల్లో ఎక్కువ రాజకీయ వేధింపులు పెరిగి తొలగింపులకు పాల్పడుతున్నారన్నారు. సెర్ప్, డిఆర్‌డిఎ అధికారులు కనీసం పద్ధతులు పాటించకుండా తొలగిస్తుంటే చేష్టలుడిగి చూస్తున్నారని చెప్పారు. కొంతమంది అధికారులు సంఘమిత్రలను రికార్డులు అప్పగించాలని బెదిరిస్తున్నారని తెలిపారు. యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షు,ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి రాణి, రెడ్డెప్ప, సుబ్రహ్మణ్యం, రెడ్డెప్పరెడ్డి, కృష్ణమ్మ మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబును కలిసిన సందర్భంలో తొలగింపులకు తమ ప్రభుత్వం వ్యతిరేకమని, ఎవరిని తొలగించమని హామీ ఇస్తే కిందిస్థాయి కూటమి నాయకులు ముఖ్యమంత్రి ఆదేశాలను సైతం పట్టించుకోకుండా ప్రజలలో వ్యతిరేకతకు కారణవుతున్నారని వాపోయారు. తక్షణం చోటా నాయకుల ఆగడాలు అరికట్ట కుంటే ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎనిమిది నెలల పెండింగ్ జీతాలు మీద దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో యానిమేటర్లు మిట్టా రామసుబ్బయ్య, కృష్ణమ్మ, శంకరమ్మ, సుమతి, పద్మావతి, ఈశ్వరమ్మ, జ్యోతి, శ్వేత, సిఐటియు నాయకులు మాదవయ్య పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల్లో విఒఎలు, నాయకులు

సబ్ జైల్‌ను సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి - రాయచోటి : ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం జడ్జి బాబా ఫక్రుద్దీన్ రాయచోటి సబ్ జైల్, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.అనంతరం జైలు పరిసరాలను, వంటగదులను, వసతి గదులను, టాయిలెట్లను, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలు ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించాలన్నారు. కార్యక్రమములో డిస్ట్రిక్ సబ్ జైల్ ఆఫీసర్, రాయచోటి సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న మర్రిపాటి రమేష్

పివికె ఫౌండర్ 'మర్రిపాటి'కి డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పివికె ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి 20 ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫౌండర్ మర్రిపాటి రమేష్‌కు గౌరవ డాక్టరేట్ దక్కింది. సోషల్ సర్వీస్ విభాగంలో భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ బెంగళూరు వారు పివికె ఫౌండేషన్ సేవలను గుర్తించి ఫౌండర్ రమేష్‌కు సోమవారం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తనకు వచ్చిన గౌరవ డాక్టరేట్‌ను నా తండ్రి స్వర్గీయ మర్రిపాటి వెంకటరమణకు అంకితమిస్తున్నానన్నారు. ఈ ప్రయాణంలో సహకరించిన హైదరాబాద్‌కు చెందిన ఇన్‌కం ట్యాక్స్ అధికారి యాదగిరికి, కుటుంబ సభ్యులకు, గురువులకు, యూనివర్సిటీ వారికి, పినాక సొసైటీ సభ్యులకు, ప్రగతి సంస్థ తిరుపతి వారికి, పోర్డ్ సంస్థ మదనపల్లె వారికి, మాస్ సంస్థ పలమనేరు వారికి, వివేకానంద పురపాలక ఉన్నత పాఠశాల సిబ్బందికి, పూర్వ విద్యార్థులకు, అమిలేపల్లి గ్రామ ప్రజలకు, మదనపల్లె పట్టణ ప్రజలకు, కురుబ కుల బాంధవవులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో పీవీకే ఫౌండేషన్ ద్వారా మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతానని తెలియజేశారు.

నిరక్షరాస్యతను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గ్రామాలలో నిరక్షరాస్యత లేకుండా చేద్దామని ఎంపిడిఒ జాషువా, ఎపిఎం దేవయాని పేర్కొన్నారు ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఉల్లాస్ ప్రోగ్రాం కింద ఎంపికైన 32 మంది డ్వాక్రా సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ 32 మంది తమ పరిధిలోని నిరక్షరాస్యులను గర్తించామన్నారు. వారికి వీలున్న సమయంలో విద్యను నేర్పించాలన్నారు. చదువుతోపాటు సమాజం పట్ల బాధ్యతలు ఆర్థిక స్వావలంభన పొదుపు చట్టాలపై అవగాహన తదితర విషయాల్లో నేర్పించాలన్నారు కార్యక్రమంలో వెలుగు సిసిలు, యానిమేటర్లు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అడ్డా రాజంపేట

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట క్రీడాకారులకు అడ్డా అని టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత సంభావు వెంకటరమణ, టిడిపి నాయకులు కె.ఎస్ నరసింహులు తెలియజేశారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ వాలీబాల్‌లో వివిధ స్థాయిలలో పథకాలు సాధించి దేశానికి ప్రాతినిథ్యం వహించబోతున్న క్రీడాకారిణులను, కోచ్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమారి, రుతిక, రేణుకుమారి, సరిత ఎనిమిదవ తరగతి నుండి వాలీబాల్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించి దేశానికి ప్రాతినిధ్యం వహించబోతున్నారని పేర్కొన్నారు.వారిని ఆణిముత్యాల్లా తీర్చిదిద్దిన కోచ్ శామీర్ బాషాతోపాటు క్రీడాకారులను సన్మానించుకోవడం గర్వకారణంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాగినేని నాగేశ్వర్ నాయుడు, దియ్యల రమణ, మేక నరసింహ, పీరు సాహెబ్, అంజిబాబు, తల్లెం శెట్టి రమేష్ పాల్గొన్నారు.



క్రీడాకారిణిలను సన్మానిస్తున్న టిడిపి నాయకులు



రక్తదానం చేస్తున్న యువత

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం వలన ఆపద సమయాల్లో ఉన్న వారి ప్రాణాలను కాపాడిన వారు అవుతామని సామాజిక సేవకురాలు సాగుబడి లావణ్య రెడ్డి అన్నారు. సోమవారం వెల్విషర్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో స్థానిక గంగమ్మ గుడి వీధిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో యువత పాల్గొని రక్త దానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సోమవారం పుట్టినరోజు జరుపుకున్న వారందరికీ మంచి జరగాలన్న ఉద్దేశంతో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఏ ప్రాంతంలోనైనా ఫ్రెండ్స్ టూ సపోర్ట్ వెబ్సైట్ లేదా మొబైల్ యాప్‌లను సందర్శించి, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారు రక్తాన్ని పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, నిర్వాహకులు సాగుబడి ఆనంద రెడ్డి, కార్తికేయ రెడ్డి, లక్ష్మీకాంత, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం ఆక్రమణపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వం మంజూరు చేసిన రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని ఆక్రమించారంటూ బాధితుడు నరసింహులు సోమవారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నివసిస్తున్న తొప్పినేని మల్లయ్య కుమారుడు తొప్పినేని నరసింహులుకు బండమీద కమ్మపల్లి సర్వేనెంబర్ 531/2ఎలో రెండు సెంట్లు ఇంటి స్థలం, ప్లాట్ నెంబర్ 73 గల పట్టాను 2010 డిసెంబర్‌లో మదనపల్లె తహశీల్దార్ మంజూరు చేశారు. అనారోగ్య కారణాలతో ఇంటిని నిర్మించుకోలేక పోవడంతో స్థలం ఖాళీగా ఉంది. స్థలం నిర్మాణం చేస్తుండడంతో శ్రీవారినగర్‌కు కొందరు స్థలాన్ని కబ్జా చేసి అడ్డుకుంటున్నారని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశానికి భారీ బందోబస్తు

ప్రజాశక్తి- గాలివీడు

బుధవారం నిర్వహించబోయే మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. డిసెంబర్‌లో ఎంపిడిఒ సి.ఎ. జోహార్ బాబుపై జరిగిన దాడిని దృష్టిలో ఉంచుకుని పోలీసులు జాగ్రత్తలు తీసుకోకున్నారు. దాడి సంఘటన తరువాత మొట్టమొదటి మండల సర్వసభ్య సమావేశం కాబట్టి ఒక డ్రోన్, వీడియో, 50 నుంచి 100 మంది పోలీస్ సిబ్బంది, ఇద్దరు సిఐలు, నలుగురు ఎస్ఐలు, నలుగురు ఎఎస్ఐలు భారీ బందోబస్తు మధ్య మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నారు.

'తొలగించిన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి'

ప్రజాశక్తి - పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్‌లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌ని ఎటువంటి నోటీసు లేకుండా అక్రమంగా తొలగించారని దీనికి నిరసనగా పాఠశాలలో సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్నట్లు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 మంది విద్యార్థులు ఉన్నప్పుడు 24 మంది నాన్ టీచింగ్ సబ్ సిబ్బందిని పాఠశాల ప్రారంభించినప్పుడు నియమించుకున్నారని, 1200 మంది విద్యార్థుల సంఖ్య పెరిగిందని మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరిగినదని పనిభారం పెరగడంతో మరో 10 మందిని తీసుకొని మూడు సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని వీరందరూ కూడా గతంలో ఎపిఎండిసికి ఇల్లు, భూమి ఇచ్చిన వారేనని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ ఉషోదయ పబ్లిక్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ గతంలో పాఠశాల ప్రారంభంలో పనిచేశారని అప్పుడు కార్మికులకు పిఎఫ్ డబ్బులు కట్టకుండా ఎగ్గొట్టారని తెలిపారు. పిఎఫ్ అధికారులు నోటీసులు కూడా ఇచ్చారని అటువంటి కాంట్రాక్టర్‌కి టెండర్ నోటీసు ఇవ్వకుండా లోపాయికారి ఒప్పందంతో అగ్రిమెంట్ చేశారని విమర్శించారు. అటువంటి కాంట్రాక్టర్‌పై విచారణ జరిపి బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. మూడు నెలల వేతనాలు చెల్లించలేదని, సంక్రాంతి పండుగ పూట కూడా కార్మికులను పస్తులు పెట్టారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ రూపానందరెడ్డి వారిని తొలగించాలని లెటర్లు ఇచ్చిన కాంట్రాక్టర్ లెక్కచేయకుండా నిర్లక్షణంగా నూతన సంవత్సరం ఒకటో తేదీ నుండి డ్యూటీకి రావద్దని చెప్పడం జరిగిందన్నారు. ప్రతిరోజు ఆఫీసుకు వచ్చి ధర్నా చేస్తున్న పట్టించుకోలేదని కాంట్రాక్టర్‌కి, మేనేజ్మెంట్‌కి నోటీసులు ఇచ్చి నిరాహార దీక్షలు చేపట్టామని పేర్కొన్నారు. తక్షణమే ఎండి, ప్రిన్సిపల్ జోక్యం చేసుకొని తొలగించిన పదిమందిని విధుల్లోకి తీసుకోవాలని, మూడు నెలల వేతనాలు కూడా తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో లలిత, లక్ష్మీ ప్రసన్న, లక్ష్మీకాంత, తొలగించిన బాధితులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న సిహెచ్.చంద్రశేఖర్

'ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి'



ధర్నా చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కూటమి ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు తప్పదని బిఎస్‌పి ఆధ్వర్యంలో మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన మహాధర్నాలో పలు పార్టీల నాయకులు హెచ్చరించారు. బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండెల గౌతం కుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ మహా ధర్నా చేపట్టారు. ఈ మహాధర్నాకు వైసిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఎస్.నిస్సార్ అహమ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మానూజ, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, మదనపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్, సిపిఐ నాయకులు మురళి, కృష్ణప్ప, తిరుమల, దేవా, వైసిపి కౌన్సిలర్లు సుగుణ ఆంజనేయులు, చంద్రశేఖర్, నర్రీ బాబాయ్, కో-ఆప్షన్ సభ్యులు శారద హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలకు తలమానికమైన మదనపల్లి సర్వజన బోధనాసపత్రిని ప్రయివేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం పన్నాగం పన్నుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాత్రం ఆస్పత్రి ప్రయివేటుపరం కాదని చెబుతున్నప్పటికీ వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ నోరు మెదపక పోవడం దేనికి సంకేతమన్నారు. విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు చెబుతున్న కూటమి పెద్దలు, ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. గత వైసిపి ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేస్తే అందులో మదనపల్లి ఒకటని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మెడికల్ కళాశాల అంశాన్ని పక్కన పెట్టేసిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా, కూటమి నాయకులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, మెడికల్ కళాశాల విషయంలో మౌనం వీడి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ ఆసుపత్రిని కాపాడాలని, వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్వహిస్తూ పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు.



మేకలకు నట్టల మందు తాపిస్తున్న పశు వైద్య సిబ్బంది

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పాడి రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ తెలిపారు. గ్రామాలలో పశు వైద్య శిబిరాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని పెద్దకారంపల్లి పంచాయతీలోని ములక్కాయలపల్లి, హస్తివారిపల్లి, గుండాలపల్లి, వరదయ్యగారిపల్లె పంచాయతీలోని పలు గ్రామాలలో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ సుమారు 485 ఆవులు, దూడలకు, 2750 గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశామని తెలిపారు. 190 ఆవులు, గేదెలు, దూడలకు పిడుదులు, గోమారులు నివారణ కోసం మందులు పిచికారీ చేయడం జరిగిందని తెలిపారు. 14 గేదెలకు గర్భకోశ పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. సరైన యాజమాన్య పద్ధతులు, వ్యాధినిరోధక టీకాల ఆవశ్యకత గురించి పాడి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హత్యరాల పశు వైద్యాధికారిణి కే.భాగ్యవతి, జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.వరదయ్య, విఎల్ఓ ఆనంద్ బాబు, ఎల్ఎస్ఎలు వెంకటసుబ్బయ్య, సుదర్శన్‌రెడ్డి, ఎహెచ్ఎలు రాజేంద్ర, ప్రియాంక, గంగరాజు, పవన్ పాల్గొన్నారు.

వీరబల్లి : పాడిరైతులకు గోకులం వరం లాంటిందని పశు వైద్యాధికారి నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని మట్లి పంచాయతీ ఎల్లంపల్లిలో పశు వైద్య అధికారి, జయప్రకాష్ ఆధ్వర్యంలో పశు వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ 250 పశువులకు చికిత్సలు చేశామని తెలిపారు.1400 గొర్రెలు, మేకలకు, నట్టల నివారణ మందు తాపించామన్నారు.పశువులను వైద్యులు పరీక్షించి చికిత్సలు చేస్తున్నామని పేర్కొన్నారు. దూడలకు జీవాలకు నట్టల నివారణ మందులను ఉచితంగా అందించడంతోపాటు వ్యాధి నివారణ టీకాలు వేయిస్తున్నామని చెప్పారు. శాస్త్రీయ యాజమాన్యంపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తు న్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలన్నారు. శిబిరాలను ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తున్నామన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి వెంకటాద్రి

ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా ఎఎస్‌పి ఎం వెంకటాద్రి అన్నారు. సోమవారం ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యతనిస్తూ సత్వరమే విచారణ జరిపి వారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని సమస్యలను వారి పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుదారులు ఆధార్ కార్డు జిరాక్స్ తప్పకుండా తీసుకురావాలని తెలిపారు.

'ఐఎఎల్' రాష్ట్ర కమిటీకి ఎన్నికైన న్యాయవాదులు

ప్రజాశక్తి - రాయచోటి : భారత న్యాయవాదుల సంఘం (ఐఎ ల్) అన్నమయ్య-కడప ఉమ్మడి జిల్లాల కమిటీ నుంచి ముగ్గురు న్యాయవాదులు టి.ఈశ్వర్, ఆర్. ఆనంద్ కుమార్ పి. రెడ్డయ్య రాష్ట్ర కమిటీకి ఎన్నికైనట్లు ఐఎఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సి. సుబ్రహ్మణ్యం తెలిపారు. కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఐఎఎల్‌కు ఉత్తమ సేవలను అందించినందుకు రాష్ట్ర కమిటీ గుర్తించి జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్ కుమార్ , ఎపిరాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 25న విజయవాడలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఎన్నుకున్నారని చెప్పారు. రాష్ట్ర కమిటీ కార్యవర్గానికి ఎన్నికైన వారు మాట్లాడుతూ ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ తమపై నమ్మకం ఉంచి రాష్ట్ర కమిటీ కార్యవర్గంలోనికి తీసుకున్నందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు.

గ్రీవెన్స్‌కు 15 ఫిర్యాదులు

ప్రజాశక్తి - గాలివీడు : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారమూ నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌ను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కె. భాగ్యలత పేర్కొన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మండలంలోని 17 గ్రామాలలోని రైతులు, ప్రజలు తమ సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రీవెన్స్‌సెల్‌కు 15 దరఖాస్తులు అందాయని, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

నేడు విద్యా వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి-గాలివీడు : విద్యా వాలంటీర్లకు మంగళవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిడిఒ సభా భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సి.ఎ. జవహర్ బాబు పేర్కొన్నారు. అనియత విద్య పైన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. ఎపిఎం, వెలుగు సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది హాజరవుతారన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: ఇంటి విషయమై తల్లిని ప్రతిరోజు వేదిస్తున్నారన్న మనస్థాపంతో కుమారుడు ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కథనం మేరకు.. కార్పెంటర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డట్లు ముదివేడు పోలీసులు తెలిపారు. మండలంలోని కనసాని వారి పల్లెకు చెందిన రామచంద్ర, రెడ్డెమ్మ దంపతులకు స్థానికంగా ఓ ఇళ్లు ఉంది. ఆ ఇంటి విషయమై బంధువులే రెడ్డెమ్మతో తరచూ గొడవపడుతున్నారు. సోమవారం మరోసారి రెడ్డెమ్మతో ఘర్షణ పడడంతో ఆమె కుమారుడు రవి తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) రాజంపేట కోర్టు నందు

I.P.No : 7/2024

మల్లిక నరసమ్మ, భర్త రెడ్డయ్య, వయస్సు 31 సం.లు, హిందూ, కులం :యానాది, నివాసం : ఎస్టీ కాలనీ కే.సి సముద్రం గ్రామము, కొండూరు గ్రామపంచాయతీ, పెనగలూరు మండలం, అన్నమయ్య జిల్లా. ...**పిటిషనర్**

V/s

ఊటుకూరు గిరిధర్ రెడ్డి, తండ్రి చంద్రారెడ్డి, వయస్సు 56 సం.లు, హిందూ, నివాసం : ఉప్పరపల్లి గ్రామము, కొండూరు పంచాయతీ, పెనగలూరు మండలం, అన్నమయ్య జిల్లా. ...**రెస్పాండెంట్ నెం.4**

నోటీసు

పై కనబరచిన పిటీషనర్ దివాలా కోరుచూ పై కోర్టు నందు పిటిషన్ దాఖలు చేసియున్నారు. మీ హాజరు నిమిత్తం 04-02-2025 వ తేదీన పై కోర్టు నందు వాయిదా ఉన్నది. కనుక పై తేదీన పై కోర్టు నందు మీరు గాని, మీ వకీలు ద్వారా గాని ఉదయం 10:30 గంటలకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనంతట మీ పరోక్షమునందు తీర్మానించబడును.

//By Order of the Court//
NAGESWAR V. CHOWDARY,
పిటిషనర్ తరపున అడ్వకేట్,
రాజంపేట.

'సూపర్‌సిక్స్'ను తప్పక అమలు చేస్తాం : మంత్రి



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గతంలో యువగళం పాదయాత్ర చేసి రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్ని మార్చిన యువ నేతగా గొప్ప గుర్తింపు తెచ్చుకున్నారని రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గతంలో యువగళం పాదయాత్ర చేసి ఈనెల 28 నాటికి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సోమవారం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో విలేరులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 40 సంవత్సరాల వయసులోనే పాదయాత్ర చేసి రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన నేతగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. రాష్ట్రంలో 5 కోట్లమంది ప్రజల ఆశలు, ఆశయాలను ప్రతిబింబిస్తూ కుప్పం శ్రీ వరదరాజస్వామి పాదాల చెంత నుంచి 2023 జనవరి 27న పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లి అన్ని వర్గాల ప్రజా సమస్యలు తెలుసుకున్నారని చెప్పారు. యువనేత లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభించడంతో అప్పటి ప్రభుత్వ పెద్దల్లో వణుకు మొదలైందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలన్నీ తప్పక అమలు చేస్తామని పేర్కొన్నారు. గతంలో ఎవరూ చేయని విధంగా ప్రతినెల 1 నే ఉద్యోగస్తుల లాగా అవ్వ, తాతలకు పెన్షన్లు, వారి ఇంటి ముంగిటికే వెళ్లి ఇస్తున్నాని తెలిపారు. ఉద్యోగులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనం ఇస్తున్నారన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తానాం్రు. ఈ ఐదు సంవత్సరాలు పూర్తయిన తర్వాత తిరిగి మళ్ళీ టిడిపి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు. ప్రజల సంక్షేమాన్ని కోరే మంచి ప్రభుత్వానికి ప్రజలందరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి గాజులు ఖాదర్ బాషా, పార్లమెంటరీ అధికార ప్రతినిధి వతన్ నిస్సార్, మాజీ మార్కెట్ చైర్మన్ చెన్నూర్ అన్వర్ భాష, సుజాత పాల్గొన్నారు.

యువగళం ఒక ప్రభంజనం : 'చమర్తి'

రాజంపేట అర్బన్ : ఎన్నికల ముందు నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర ఒక ప్రభంజనమని, ఆ పాదయాత్రే పార్టీ గెలుపునకు నాంది పలికిందని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. యువగళం పాదయాత్ర ప్రారంభమై నేటికి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం రాజంపేట పార్లమెంటు క్యాంపు కార్యాలయంలో టి ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ ఆధ్వర్యంలో భారీ కేక్ కోసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చమర్తి జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ 2023 జనవరి 27న ప్రారంభమైన నారా లోకేష్ చారిత్రాత్మక యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాలలో విప్లవాత్మక మార్పు నాంది పలికిందని అన్నారు. 226 రోజుల్లో 2097 గ్రామాలలో 3,132 కిలోమీటర్లు సాగిందని, యాత్రలో భాగంగా 70 బహిరంగ సభలు 155 ముఖాముఖి సమావేశాలు నిర్వహించడంతోపాటు ప్రజలు మరియు కార్యకర్తల సమస్యలను లోకేష్ బాబు నేరుగా విన్నారని తెలిపారు. అనేక అడ్డంకులు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ నారా లోకేష్ చేపట్టిన ఈ పాదయాత్ర రాయలసీమ రాతను మార్చి టిడిపి విజయానికి కీలకంగా నిలిచిందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు ఆర్. సతీష్ రాజు, పట్టణ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి అబుబకర్, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు పోలి శివకుమార్, ముస్లిం మైనారిటీ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.కె.కరీం పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం



కడకడ : హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కలకడ

అవార్డు గ్రహీత కోన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోడెం చంగల్ రాయుడును ఎంఇఒ మునీంద్రనాయక్ ఉపాధ్యాయులు కలసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంగల్ రాయుడు మండల, జిల్లా, రాష్ట్ర అవార్డులు వచ్చాయని ఇవి ఆయన పనితీరుకు ఇది నిదర్శనం తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయులను పూలమాలలు శాలవులతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివారెడ్డి, నాగముని నాయక్, రమేష్ కుమార్‌రెడ్డి, రెడ్డప్ప, షౌకత్ అలీ, సైరా భాను, ఝాన్సీ రాణి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు. **పీలేరు:** ఉత్తమ ఎంఇఒగా ప్రశంసా పత్రం అందుకున్న లోకేశ్వర్‌రెడ్డిని మండల వనరుల కేంద్రంలో సిబ్బంది, ఎంఇఒ బి.పద్మావతి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎంఇఒ లోకేశ్వర్‌రెడ్డి స్పందిస్తూ ఈ అవార్డు తనమీద మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు జలకనూరి మురళీధర్‌రాజు, ఎస్.నాగరాజ, ఎం.అశోక్, పి.మాధవి, ఎంఐఎస్ శిరీష, డిటిఇఒ తాజూన్, మెసెంజర్ ఆర్.సత్యనారాయణ, ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయులు వై.సుబ్రమణ్యం, డి.ధరనీజ విశ్రాంత ఉపాధ్యాయులు ఆదాం సాహెబ్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తికి ఉత్తమ అవార్డు తీసుకున్న సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నాకు అవార్డు దక్కడానికి ప్రధానంగా కళాశాలలోని అధ్యాపక, అధ్యాపకేతర బృందం కృషి ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో బాగా చదివి జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఆకాక్షించారు.



పీలేరు: ఎంఇఒను సన్మానించిన ఎంఆర్‌సి సిబ్బంది

సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-కలికిరి

మండల వ్యాప్తంగా జనవరి 20 నుండి ఫిబ్రవరి 2వ వరకు రెండు వారాలపాటు ఇంటింటి కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించే సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నామని మెడికుర్తి వైద్య అధికారి డాక్టర్ కావ్య గంధ అన్నారు. మండలంలోని జ్యోతిరావు పూలే బాలికల గురుకుల విద్యార్థులకు, చేరువు ముందరపల్లిలో నిర్వహిస్తున్న 104 సేవలలో భాగంగా ప్రజలకు హెల్త్ ఏడ్యూకేటర్ మహమ్మద్ రఫీ కుష్టు వ్యాధి సర్వే, లక్షణాలు, వ్యాధి కారక క్రిమిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ ఏడ్యూకేటర్ మాట్లాడుతూ ఈ సంవత్సరము కుష్టు వ్యాధి ఇంటింటి సర్వేను అంగవైకళ్యాన్ని నివారించడానికి ముందుగానే కుష్టు వ్యాధిని గుర్తించి చికిత్సను అందిస్తామనే తీమ్‌తో చేస్తున్నామని తెలిపారు. మండలంలోని 14 సచివాలయంలో ఉన్న ఎఎన్ఎంలకు, ఆశా కార్యకర్తలకు, పురుష కార్యలర్తలకు సర్వేపై శిక్షణ ఇచ్చామన్నారు. క్షేత్రస్తాయిలో సర్వే చేయనున్న ఆశాకార్యకర్తలకు, పురుష వాలంటీర్‌లకు ఆయా పిహెచ్‌సిలలో ఇంటింటి సర్వేపై శిక్షణ ఇచ్చామన్నారు. కుష్టు వ్యాధి ఒక సూక్ష్మ క్రిమి వల్ల వస్తుందని స్పర్శ లేని మచ్చలు, రాగి రంగులో ఉండి మచ్చపై భాగంలో వెంట్రుకలు మొలచవని, నొప్పి ఉండదని, మిన, మిన మని మెరుస్తూ ఉంటాయని, శరీరంలో ఏ భాగంలోనైనా ఉండవచ్చునని, ఒక మచ్చ నుండి ఐదు మచ్చులు లోపు ఉంటే పాసి బాసిల్లయి అంటారని పేర్కొన్నారు. కుష్టు వ్యాధికి చికిత్స, పరీక్షలు పూర్తిగా ఉచితంగా అందిస్తామని, కుష్టు వ్యాధి సర్వేలో మగ కార్యకర్తలు ఆశాకార్యకర్తలు ఒక టీమ్‌గా వెళ్లి సర్వే చేస్తారని సర్వేకు ప్రజలు సహకరించి శరీరంపై ఉన్న అనుమానిత స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లయితే సర్వే బృందంచే పరీక్ష చేయించుకుని కుష్టు వ్యాధి కాదని నిర్ధారణ చేసుకోవాలని కోరారు. సర్వే చేయు బృందం అనుమానిత కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించి వారిని పిహెచ్‌సి వైద్య బృందం చే మరొక్కసారి స్క్రీనింగ్ చేయించి ఒకవేళ నిర్ధారణ ఐతే వారికి ఎండిటి (బహుళ ఔషద చికిత్స)వెంటనే ప్రారంభిస్తారన్నారు. తొలిదశ లోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకోవడం వల్ల అంగవైకల్యం రాకుండా నివారించవచ్చునని తెలిపారు. సర్వే కొరకు ఏ రోజు వారి గ్రామానికి వస్తారనే సమాచారం ఆశాకార్యకర్తలు ముందురోజు తెలియచేస్తారని తెలిపారు. కుష్టు వ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సోమశేఖర్, ఎంఎల్‌హెచ్‌పిలు నాగవేణి, సైరా భాను, ఎఎన్ఎంలు రమాదేవి, నఫీశా, ఆశాకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న నిర్వాహకులు, గ్రామస్తులు

ఉచిత కేన్సర్ వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైదేహి హాస్పిటల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సహకారంతో తుమ్మరకుంటలో సోమవారం ఉచిత కేన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించగా 20 మంది కేన్సర్ బాధితులకి ఉచితంగా బస్ సౌకర్యం కల్పించి శస్త్రచికిత్సలు చేయిస్తామని వైదేహి హాస్పిటల్ తరుపున డాక్టర్ లోకేష్ భరణి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ మాట్లాడుతూ ఉచిత కేన్సర్ వైద్య శిబిరాన్ని ప్రజలు చక్కగా సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఎందుకు సహకరించిన వైదేహి ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులకి కృతజ్ఞతలు తెలియజేశారు. ముమ్ముందు మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రవికుమార్, ఎంఇఒ గౌస్ పీర్, బూర్లపల్లి స్కూల్ ఉపాధ్యాయులు రెడ్డెప్పరెడ్డి, తుమ్మరకుంట-1 రాజేశ్వరి, ప్రేమ స్వరూప రాణి ఎఎన్ఎం, విజయలక్ష్మి ఫీహెచ్ఒ, ఆశవర్క్ వెంకట రమణమ్మ, తులసి, రెడ్డెమ్మ, గంగరాణి, సచివాలయం సిబ్బందితో పాటు ముఖ్య అతిధులకు స్థానికులు గడ్డం గంగిరెడ్డి, గిరి స్వామి, బూర్లపల్లి సర్పంచ్ సుబ్బిరెడ్డి యంగ్ ఇండియాసేవాఫౌండేషన్ అధ్యక్షులు రాజశేఖర్ సభ్యులు అనిల్, చంద్రశేఖర్, రెడ్డిబాషా, మౌని, చంద్ర విశ్వనాధ్, శ్రీనివాసులు, శ్రీకాంత్ హాస్పిటల్ కేన్సర్ వైద్య సిబ్బంది డాక్టర్ హరీష్, డాక్టర్ కిరణ్, డాక్టర్ లోకేష్, ఎకో సిబ్బంది పాల్గొన్నారు. హాస్పిటల్ సిబ్బందికి భోజన వసతి గడ్డం గంగిరెడ్డి, మైక్ సెట్ బుచ్చిగారి సుబ్బి రెడ్డి, లక్ష్మీనారాయణ బూర్లపల్లి, నీరు వసతి శ్రీరామ రాజేష్ తుమ్మరకుంటలు కల్పించారు.

అంగన్వాడీకి ప్రహరీ నిర్మించరూ..!

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలోని డి. రాచపల్లి పంచాయతీ పెద్ద మాదిగపల్లెలో ఉన్న అంగన్వాడీ సెంటర్‌కు ముందు వైపు ప్రహరీ లేదు. బడి వేళలోనే పశువులు, జీవాలు, సంచరిస్తూ చిన్న పిల్లలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఓవైపు రోడ్డుపైన స్కూటర్లు, ట్రాక్టర్లు, కుక్కలు, పశువులు, తిరుగుతున్నాయి. అటు రోడ్డు వైపుకు పిల్లలు వెళ్లే ప్రమాదానికి గురికావాల్సి వస్తుంది. రాత్రి వేళలో కొంతమంది ఆకతాయిలు మందు తాగి బీర్లు బాటిళ్లను పగులగొట్ట అక్కడే వేస్తూ ప్రాంగణాన్ని అపరిశుభ్రంగా మార్చే స్తున్నారు. వెంటనే సంబంధితాధికారులు స్పందించి ప్రహరీని ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.



ప్రహరీ లేని అంగన్వాడీ కేంద్రం

నెలకొరిగిన విద్యుత్ స్తంభం : తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - గాలివీడు

స్థానిక పంచాయతీలో పెద్దూరు కస్పా ప్రధాన రహదారిపై విద్యుత్ స్తంభం నెలకొరిగింది. దీంతో సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ స్తంభించిపోయింది. గాలివీడు నుంచి దానం రెడ్డి గారి పల్లి వరకు వెళ్లే విద్యార్థుల ప్రయివేట్ వ్యాన్లు అన్ని నిలిచి పోయాయి. కస్పాలో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. స్థానికులు విద్యుత్ స్బిందికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వారు వచ్చి మరమ్మతులు చేపట్టారు. అయినప్పటికీ రాత్రి పెద్దూర్ కస్పాలో విద్యుత్ సరఫరా నిలిచి అంధకారం నెలకొంది.



పెద్దూరులో నెలకొరిగిన విద్యుత్ స్తంభం



ర్యాలీ నిర్వహిస్తున్న మిట్స్ సిబ్బంది, విద్యార్థులు

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

ప్రజాశక్తి-కురబలకోట(మదనపల్లె)

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం అని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని కురబలకోట తహశీల్దార్ తపస్విని అన్నారు. సోమవారం మిట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా అంగళ్లులో ర్యాలీని నిర్వహించినారు. ఈ సందర్భంగా తహశీల్దార్ తపస్విని పట్టణ ప్రజలకు, విద్యార్థులకు ఓటు హక్కు, నమోదు గురుంచి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ (విహెచ్ఎ)ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని కూడా ఈ సేవలను పొందవచ్చని పేర్కొన్నారు. స్థానిక బూత్ స్థాయి అధికారి (బిఎల్ఒ), ఓటరు నమోదు అధికారి (ఇఆర్ఒ)ను కలసి సంబంధిత దరఖాస్తు ఫారాన్ని నింపి అందజేయాల్సి ఉంటుందన్నారు. ఓటరు నమోదు కోసం కొత్తగా దిగిన ఫొటోతో పాటు అడ్రస్, బర్త్ డీటెయిల్స్ కోసం పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్ బిల్లు డిమాండ్ నోటీసు, గ్యాస్, బ్యాంక్ పాస్‌పుస్తకాలు వంటి పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్ ప్రతి విద్యార్థి చేతిలో ఉందని ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటు వచ్చిన తరువాత తమ బాధ్యతగా ఓటు హక్కును వినియోగిం చుకోవాలన్నారు. కార్యక్రమంలో కురబలకోట అర్ఐ బాలసుబ్రహ్మణ్యం, విఆర్ఒ ఖాదర్‌బాషా, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల ఎస్‌ఒను సస్పెండ్ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బాలికలచే పనులు చేపిస్తున్న కస్తూర్బా పాఠశాల ఎస్ఒ శైలజాను సస్పెండ్ చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా, పిఎం పోషణ్ సామాజిక తనిఖీ బృందం 2024 జూన్ నుంచి డిసెంబర్ వరకు సంబంధించి గత కొన్ని రోజులుగా ప్రభుత్వ, రెసిడెన్సియల్ స్కూళ్లను తనిఖీ చేస్తోందని, ఈ క్రమంలో పెద్దతిప్పసముద్రం కస్తూర్బా గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన సందర్భంగా ఎన్నో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఎస్ఓతో పాటు ఆమె కుటుంబ సభ్యుల దుస్తులన్నీ బాలికలే ఉతికి ఆరేస్తున్నారని, పిల్లలతో వేకువజామునే చపాతీల పిండి రుద్దిస్తున్నారని, వంట పనులకు వాడుకుంటున్నారని, పనులు చేయని వారిని పత్రికల్లో రాయలేని విధంగా అసభ్య పదజాలంతో దూషిస్తూ కుల వివక్ష చూపుతున్నారని విద్యార్థులు ఆవేదన చెందడాన్ని గుర్తు చేశారు. ఎస్ఒ భర్త ఎప్పుడుపడితే అప్పుడు స్కూల్లోకి వచ్చి పుష్టిగా భోజనం అరగించి అక్కడే ఉంటున్నారంటే బాలికలకు రక్షణ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచన్నారు. విద్యార్థుల చేత చాకిరీ చేపించడమే కాకుండా, కుల వివక్షతను పాటిస్తూ బూతులు తిడుతున్న ఎస్ఒ శైలజపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.



బాలికల ఫుట్‌బాల్ క్రీడాకారులతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

బాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఖేలో ఇండియా అస్మిత అండర్-17 బాలికల ఫుట్‌బాల్ లీగ్ పోటీలు మదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షాజహాన్‌బాష హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో శ్రీవేద, చెంబకూరు, వశిష్ట, సిటిఎం, చంద్రమాకులపల్లె, ఉర్దూ మున్సిపల్ స్కూల్, కన్నెమడుగు, వాల్మీకిపురం నుండి బాలికల జట్లు పాల్గొ న్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాష మాట్లాడుతూ చిన్నపుడు తను ఆడిన ఫుట్‌బాల్ ఆటను గుర్తుకు వస్తోందన్నారు. పిల్లలు ఫుట్‌బాల్ ఆడడం వల్ల మనసు, శరీరం చురుకుగా, ఆరోగ్యంగా వుంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను మదనపల్లెలో చేపట్టుతుండడం గప్ప పరిణామమని ఆలిండియా ఫుట్‌బాల్ అసోసియేషన్, ఎపి ఫుట్‌బాల్ అసోసియేషన్‌లను ప్రశంసించారు. అనంతరం పిల్లలతో కలిసి కాసేపు సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. వారం రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్, మురళీధర్ తెలిపారు. విజేత జట్టుకు రూ.50 వేలు, రన్నర్‌కు రూ.30 వేలు ప్రైజ్‌మని ఉంటుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి గౌస్ బాష తెలిపారు. కార్యక్రమం లో క్రీడా భారతి కార్యదర్శి నరేష్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు దేవకమ్మ, రమేష్, భాష్, ఉమాదేవి, మహేంద్ర, కోచ్ మహేంద్ర, ఆంజనప్ప. బాలాజీ, సైషావల్లి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.2.73 లక్షలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె : మండలంలోని కోసవారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం టిటిడి ఎఇఒ గోపీనాథ్, ఆలయ ఇన్స్పెక్టర్ దుష్యంత్ కుమార్ ఆధ్వర్యంలో పరకామణి లెక్కించారు. కొన్ని దారా వచ్చిన కానుకలను రూ.2,73,320 వచ్చినట్లు తెలిపారు. అక్టోబర్ నెల నుండి ఈరోజు వరకు నాలుగు నెలలపాటు భక్తుల సమర్పించిన కానుకల రూపంలో ఈ ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

షూటింగ్ బాల్ జట్టుకు యూసఫ్ ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : నేపాల్ దేశంలో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు జరగబోయే 2వ ఏషియన్ షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొనే భారత జట్టుకు మదనపల్లె కు చెందిన సీనియర్ షూటింగ్ బాల్ క్రీడాకారుడు మహమ్మద్ యూసఫ్‌బాషా ఎంపికయ్యాడు. షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ చేసింది. క్రీడాకారుడు ఈనెల 30వ తేదీ ఢిల్లీలో జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొంటాడు. భారత జట్టుకి ఎంపికైన యూసఫ్ బాషకు ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పరుశురాముడు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. దక్షిణ భారత దేశం నుండి మన మదనపల్లికి చెందిన యూసఫ్ ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని అన్నమయ్య జిల్లా కార్యదర్శి గౌతమి నరేష్ అన్నారు. యూసఫ్ అంతర్జాతీయ పోటీలలో రాణించి దేశానికి మంచిపేరు తీసుకురావాలని కోచ్, అన్నమయ్య జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు రమణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌రెడ్డి శ్రీనివాస్, సాగర్, కోశాధికారి సాయి శేఖర్‌రెడ్డి, సభ్యులు నాగేంద్ర ప్రసాద్, పవన్, సురేష్, సయ్యద్ భాష, భారతి, మురళీ, క్రీడా భారతి అధ్యక్షులు దిలీప్ కుమార్, విజయ్ కుమార్, కరాటే సురేష్, క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్, ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్, వ్యాయామ ఉపాధ్యాయులు ఖాదర్ భాష, సీనియర్ క్రీడాకారులు మురళీ, ఉదయ్, శ్రీకుమార్ ఆకాంక్షిస్తూ అభినందించారు.



యూసఫ్‌బాషాను అభినందిస్తున్న కోచ్, సభ్యులు